# నిజాయితీ

ఉదయం ఆరుగంటలైంది. టూత్‌బ్రష్ పట్టుకొని వీధరుగుమీద కొచ్చాను. వీధి చివర రంగనాథం గారింటిముందు జనం గుంపు కూడారు.

"ఏవిటి చెప్మా విశేషం?" అని ఆశ్చర్యపోతూ నేనూ పరిగెత్తాను.

"ఏం జరిగిందని" ఓ పెద్దమనిషి నడిగాను.

అతడు నావంక ఓ మారు ఎగాదిగా చూస్తూ తెలియదన్నట్లు పెదిమ విరిచాడు.

గుంపును తోసుకుంటూ ఓ పన్నెండేండ్ల కుర్రాడు రంగనాథంగారింట్లోంచి బయటకు వచ్చాడు.

ఆ కుర్రాడి చుట్టూ ఓ పదిమంది మూగి ప్రశ్నల వర్షం కురిపించసాగారు.

"త్రాచుపామండీ!' అన్నాడు కుర్రాడు.

"ఎక్కడుంది?"

"రంగనాథంగారి పడగ్గదిలో దూరింది'

"చంపారా?"

"ఛ! ఛ! మహాపాపం గదండీ!"

"పాముల వెంకడ్ని పిలిపించారు. పామును పట్టించడాన్కి"

పాముల వెంకడు ఆ చుట్టుపక్కల ఏడెనిమిది గ్రామాల్లో పాముల్ని పట్టడంలో గొప్ప నేర్పరి. పేరు ప్రఖ్యాతులు గడించాడు. ఎంత విష సర్పాన్నైనా యిట్టే అవలీలగా పట్టేస్తాడు. అదే వాడి జీవనోపాధి.

"అబ్బ! ఎంత పాముందో చూడండి!" అన్నారు వెంకడి చేతుల్లో వున్న పామును చూసి ఆశ్చర్యపోతూ– వెంకడు పాముతలను కుడిచేత్తో పట్టుకొని రోడ్డు మీదకొచ్చాడు.

పాము చాల పెద్దదే! యించుమించు నాలుగైదడుగుల పొడవుంటుంది.

'చింతనాగండి! ఆ రంగే చెప్తాంది' అన్నాడో పెద్ద మనిషి ఒకడుగు ముందుకేసి పామును పరకాయించి చూస్తూ.

'దొరగోరూ! పై సాలిప్పించండి!' అన్నాడు వెంకడు రంగనాధంగార్ని.

'దాన్నెక్కడో ముందు తొందరగా పారేసి రారా! పిల్లలు భయపడ్తున్నారు' అన్నారు రంగనాధంగారు చిరాగ్గా.

'సిత్తందొరా!' అంటూ వెంకడు చిరునవ్వుతో వెళ్లి ఓ పావుగంటలో తిరిగొచ్చాడు.

'యిదుగోరా తీసుకెళ్లు నీకష్టం మేం ఎప్పుడూ వుంచుకోం!' అంటూ ఓపావలా బిళ్ల వాడి చేతులో వుంచారు రంగనాధంగారు.

'యిదేటి దొరా! నామామ్మూలు రూపాయండి' అన్నాడు వెంకడు చేతులు జోడించి.

'ఈ మాత్రందానికి రూపాయేం! డబ్బేం తేరగా వస్తోందనుకున్నావురా!' అంటూ విరుచుకుపడ్డారు కోపంగా.

'నానేం బేరాల్సెప్పనేదండి. కావాలిస్తే వొవుర్నేనా అడగండి.'

'ఈ భాగ్యానికి నేనొహర్నడగాలా ముందు బయటకు నడు'.

'ఇంటున్నారా సెలవయ్యగోరూ! నాను మీకు ముందే సెప్పానుగందా, యితగాడిలాటి పేసిగీలెడతాడని'.

'ఒరేయ్! వెంకా నువ్వూరుకో! చూడండి రంగనాధంగారూ! వాడుట్టి అడవి మనిషి. రూపాయికి తక్కువిస్తే పుచ్చుకోడు. నేను ముందే ఒప్పుకొని తీసుకొచ్చాను. వాడితో తగూపడ్డం కష్టం. మీరివ్వకపోతే నేనిచ్చుకుంటా' అన్నారు రంగనాధంగారి పొరుగింటి చలమయ్యగారు.

"ఆఁ! ఆఁ! ఎంత మాట మీరెందుకూ నేనే యిస్తా' అంటూ యింట్లోంచి పర్సు పట్టుకొచ్చారు రంగనాధంగారు.

"ఇంద తగలడు" అంటూ రూపాయి కాగితం వాడిచేతులో వుంచి ముందిచ్చిన పావలా కాసు తీసుకున్నారు విసురుగా.

"దండాలండయ్య! సెలవయ్య బాబూ ఎల్లొస్తా" అంటూ వెంకడు బయటకు నడిచాడు.

"వెంకడు చాల నిజాయితీ మనిషి అంటారంతాను" అన్నారు చెలమయ్యగారు వాడు వెళ్లిన వేపే చూస్తూ.

'ఆఁ! ఏం నిజాయితీ లెస్తురూ! ఎద్దులా వున్నాడు వెధవ ఒళ్లొంచి పనీపాటూ ఏం చెయ్యడు. ఎప్పుడూ ఎవడు దొరుకుతాడాని కాచుకూర్చుంటాడు' అన్నారు రంగనాధంగారు.

చలమయ్యగారు సమాధానంగా చిరునవ్వు నవ్వి వూరుకున్నారు.

"బాబూ" అంటూ వెంకడు మళ్లీ వచ్చి గుమ్మంలో నిల్చున్నాడు.

"ఏంరా?! ఏమొచ్చింది మళ్లీ!" అన్నారు కోపంగా.

"రూపాయండి...."

చాల్లేదు కదూ! నాకు తెలీదూ నీవేషాలు నీలాంటివాడ్ని గుమ్మంలోకి రానీయడం....."

"అది కాదండయ్య తమరు పొరపాట్న రెండు కాయితాలిచ్చేసినారు. యియిగో సూడండి. అన్నేయంగా మీసొమ్ము నాకక్కర్నేదండి" అంటూ కాగితాల్లో ఒకటి రంగనాధంగారి కిచ్చాడు.

"సెలవండయ్య ఎల్లొస్తా" అన్న వెంకడి మాటలకు స్తంభించి పోయారు రంగనాధంగారు.

'చిత్రగుప్త' *21.1.1953.*